క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



గుడివాడలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో వెనుకబడిన వారి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. మండలంలోని కరకవలస, గుడివాడ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్, రికార్డులు పరిశీలించి, విద్యాబోధనపై ఆరా తీశారు. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ వ్యవసాయ శాఖ సిబ్బంది

జామి: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయశాఖ సిబ్బంది సంయుక్తంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ టి.అప్పలనాయుడు, ఏడీఏ రామారావు, తదితరులు రికార్డులు, నిల్వలు, లైసెన్స్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్దేశించిన ధరలకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎం.పూర్ణిమ, వీఏఏలు పి.కూర్మారావు, షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే



చార్టులు, ప్లకార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన చార్టులను ప్రదర్శించారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.విజయ మాట్లాడుతూ.. యువత నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. వృత్తివిద్యా ఉపాధ్యాయులు జగదీష్, దేవి మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే వృత్తివిద్యా కోర్సులు నేర్చుకోవడం మంచిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, క్విజ్ కాంపిటేషన్, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటికలు ఆకట్టుకున్నాయి.

పరామర్శ



ధర్మారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెల్లి ధర్మారావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు బుధవారం పరామర్శించారు. ధర్మారావు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ వింగ్ జిల్లా అధ్యక్షుడు బెల్లాన బంగారునాయుడు, రాష్ట్ర కార్యదర్శి కెంగువ మధుసూదనరావు ఉన్నారు.

మధ్యవర్తిత్వం ఎంతో మేలు

- జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి, తదితరులు

గజపతినగరం రూరల్: మధ్యవర్తిత్వం కమిటీతో కక్షిదారులకు ఎంతో మేలు జరుగుతుందని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు కోర్టు ఆవరణ నుంచి గజపతినగరం ప్రధాన వీధుల్లో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వాన్ని ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకువెళ్లేందుకే అవగాహనా ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్స్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగిన కోట

- ప్రధాన రహదారి జలమయం..
- మోకాలి లోతులో నేషనల్ హైవే..
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



ఎస్.కోట ప్రధాన రహదారిలో వరద నీటిలో పాదచారులు పాట్లు



ఎస్.కోట ప్రధాన రహదారిలో నిలిచిపోయిన ట్రాఫిక్

శృంగవరపుకోట: 'మేము అధికారంలోకి వస్తే ఎస్.కోట నడిబొడ్డున ఐటీ టవర్ కడతా.. టవర్ కింద కూర్చుని ఐటీ ప్రొఫెనల్స్ అంతా ఉద్యోగాలు చేసుకోవచ్చు' అంటూ నాడు ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతలు లేని రోడ్లు వేస్తాం.. పల్లె పండుగ నిర్వహిస్తాం అని ప్రకటించారు. గుంతల మాట దేముడెరుగు.. చేపల చెరువులా మారిన ఎస్.కోట రోడ్డు స్థానిక ప్రజాప్రతినిధులకు కనిపించక పోవడం విడ్డూరం. అరుకును ఆంధ్రా ఊటీ చేస్తానంటూ చెప్పిన చంద్రబాబుకు, పార్టీ పెద్దలకు అరుకు వెళ్లే ఎస్.కోట రోడ్డు ఆక్రమణదారుల చెరలో చిక్కి వర్షపు నీటితో నిండిపోతోందన్న విషయం తెలియకపోవడం బాధాకరం. బుధవారం కురిసిన భారీ వర్షం తాకిడికి ఎస్.కోట ప్రధాన రహదారి చెరువును తలపించింది. కుళ్లు కోనేరు పొంగి పార్లి బాబా గుడి వద్ద మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద కాలువలు కబ్జాలకు గురికావడంతో నీరు నిలిచింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు నరకయాతన అనుభవించారు.



ఆర్‌అండ్‌బీ ఎదుట రోడ్డుపై పారుతున్న వరదనీరు



ఇది చెరువు కాదు.. వరదనీట మునిగిన విశాఖ -అరుకు నేషనల్ హైవే



కుళ్లుకోనేరుకు గండి పడి రోడ్డుమీదికి వస్తున్న వరదనీరు

అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాలు

- ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆశియ్య

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చునని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.ఆశియ్య తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 1200 ఓటర్లు కలిగిన పోలింగ్ బూతుల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా.. కొంతమంది ఓటర్లను వేరు చేసి కొత్త పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పిస్తోందన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలు పేరు, చిరునామా మార్పులు కూడా చేసుకోవచ్చునని చెప్పారు. సమర్థవంతమైన ఓటర్ల జాబితాలు రూపొందించడానికి ఈ సమావేశాలు దోహదపడాలన్నారు. రాజకీయ పార్టీలు ఇచ్చే సూచనలు కూడా స్వీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, కూటమి నేతలు గవిడి నాగరాజు, ఇప్పిలి నీలకంఠం, తహసీల్దార్ డి.ధర్మరాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ నేతలతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ ఆశియ్య

నియామకం



టి. కిరణ్ కుమార్



కె. విమలారాణి

గుర్ల: మండలంలోని తెట్టంగి పీఏసీఎస్ చైర్మన్‌గా తిరుమలరాజు కిరణ్‌కుమార్, కెల్ల సొసైటీ చైర్‌పర్సన్‌గా కొలుకులూరి విమలారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయా సొసైటీ సీఈఓలకు జిల్లా అధికారులు బుధవారం ఉత్తర్వులు పంపించారు. ఉత్తర్వుల కాపీలను నియామకమైన వారికి సొసైటీ సిబ్బంది అందజేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని మెంటాడ గ్రామ రహదారిలో ఆంధ్ర వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో స్తంభం ఒరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఒరిగిన స్తంభం స్థానంలో వేరే స్తంభం ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ రాజు తెలిపారు.

తులసీరామ్ మృతి తీరనిలోటు

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసాల తులసీరామ్ మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. పాముకాటుతో మృతి చెందిన తులసీరామ్ అంత్యక్రియలు బుధవారం చేపట్టాగా.. మాజీ ఎమ్మెల్యే, తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. తులసీరామ్ గొట్లాం సర్పంచ్‌గా ఎనలేని సేవలు అందించారని బొత్స ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన సతీమణి సరోజిని వైస్ ఎంపీపీగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చల్లా చలంనాయుడు, గంట్యాడ జెడ్పీటీసీ సభ్యుడు వి. నరసింహమూర్తి, పార్టీ నాయకులు బీవీ ప్రభుజీరాజు, బొద్దల చిన్నం నాయుడు, మహంతి రమణ, తదితరులున్నారు.

వల్లంపూడిలో పారిశుధ్య పనులు

వేపాడ: మండలంలోని వల్లంపూడి పంచాయతీలో బుధవారం సాయంత్రం జేసీబీతో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి గోగాడ పద్మ నేతృత్వంలో వేపాడ - సోంపురం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చెత్త సంపద కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఏరివేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రజలందరూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, అంబాసిడర్లు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



సత్కారం అందుకున్న బదిలీ ఉద్యోగులతో సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు

చీపురుపల్లి: సచివాలయాల ఉద్యోగులు గ్రామ ప్రజలకు ఎంతో విలువైన సేవలు అందించారని.. అలాంటి వారిని సత్కరించుకోవడం మనందరి బాధ్యతని నిమ్మలవలస సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు అధికార్ల ఉమాదేవి, శ్రీనుబాబు అన్నారు. మండలంలోని నిమ్మలవలస గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమే అయినప్పటికీ, ఎక్కడైనా ప్రజలకు విలువైన సేవలు అందించడంతో ఉద్యోగులు ముందుండాలన్నారు. అదేవిధంగా వారి స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు చక్కని సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టి.కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో పంటలకు జీవం..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఇటీవల కురిసిన వర్షంతో మెట్టు, పల్లపు భూముల్లో సాగులో ఉన్న పంటలు జీవం పోసుకున్నాయి. కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో అల్లాడుతున్న మొక్కజొన్న, వేరుశనగ, చెరుకు, బొప్పాయి పంటలతో పాటుగా అపరాలైన మినప, పెసర, కూరగాయ పంటలకు వర్షంతో ఎంతో లాభం చేకూరనుంది. ఖరీఫ్‌లో భాగంగా రైతులు వరి విత్తనాలు విత్తిన తర్వాత సరైన వర్షం లేకపోవడంతో వరి ఆకులు ఎండపోయాయి. చాలా చోట్ల రైతులు బిందెలతో నీరు మోసి ఆకులకు నీటి పదును అందించారు. కొన్ని రోజుల కిందట సాగుచేసిన మెట్టు పంటలైన మొక్కజొన్న, వేరుశనగ మొక్క దశలోనే వాడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు సరైన వర్షాలు లేక.. మరోవైపు ఏప్రిల్, మే నెలలను తలపిస్తున్న ఎండల తీవ్రతతో ఎక్కడ పంటలు పాడైపోతాయేమోనని రైతులు ఆందోళన చెందారు. ఈ పరిస్థితిలో వర్షాలు పడడంతో పంటలకు జీవం వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గరివిడి మండలంలో ప్రతి ఏడాదీ ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, వేరశనగ పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు.



వర్షపునీరుతో జీవం పోసుకున్న వరి నారు

రోడ్డు నిర్మాణానికి సహకరించండి

శంగవరపుకోట: గిరిశిఖర గ్రామమైన రేగ పుణ్యగిరికి రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు సహకరించాలని జనసేన నేత ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు. గ్రామస్తులతో కలిసి బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ..ఈ ఏడాది జనవరిలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వచ్చి, రూ. నాలుగు కోట్ల ఉపాధి నిధులతో 35 కిలోమీటర్ల రహదారిని ఉగాది నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని ఇంతవరకు ఎటువంటి పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణానికి సహకరించాలని కోరారు.



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నేత సన్యాసినాయుడు

రామాలయంపై పిడుగు

శృంగవరపుకోట: మండల వ్యాప్తంగా బుధవారం వర్షం కురిసింది. ఈ క్రమంలో సీతారాంపురం గ్రామంలో గల రామాలయంపై పిడుగు పడింది. దీంతో గుడి పైభాగంలో ఒకవైపు చిన్నభాగం స్వల్పంగా దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు.



పిడుగుపాటుకు స్వల్పంగా దెబ్బతిన్న రామాలయం గోపురంలో ఒక భాగం

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

శృంగవరపుకోట: ఎరువులు, విత్తనాలు ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు ఎం. రామారావు, విజిలెన్స్ సీఐ టి. అప్పలనాయుడు, మండల వ్యవసాయాధికారి కె. రవీంద్ర అన్నారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని దుకాణాల్లో లోపాలను గుర్తించినట్లు చెప్పారు. రైతులకు విక్రయించిన ఎరువులు, విత్తనాలు, మందులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ సహాయకుడు కె.ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న రూరల్ ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధుపాడ, మరుపల్లి, తమ్మారాయుడిపేట, ఎం.గుమడాం గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు

జామి: మండల కేంద్రమైన జామిలో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జామి - కొట్టాం రోడ్డులో ఉన్న సీతారామ కల్యాణ మంటపంలో సమావేశం జరగనుందని, ఈ సమావేశంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీపై సమీక్షిస్తారని పేర్కొన్నారు. కూటమి మోసాలను ప్రజలకు వివరించడంపై పలు సూచనలు చేయనున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య హాజరుకానున్న సమావేశానికి మండలంలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

మళ్లీ 'ఎరువు' కష్టాలు ..!

- ఎండలో పడిగాపులు కాస్తున్న మహిళలు, వృద్ధులు
- పోలీసుల పర్యవేక్షణలో స్లిప్పుల పంపిణీ



రామలింగాపురం పీఏసీఎస్ గొడౌన్ వద్ద ఎండలో యూరియా కోసం గుమిగూడిన రైతులు



యూరియా కోసం వచ్చి చెట్ల కింద కూర్చున్న వృద్ధులు, మహిళలు



పోలీసుల సమక్షంలో పంపిణీ చేస్తున్న స్లిప్పులు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం రాగానే యూరియా కష్టాలు మొదలయ్యాయని రైతులు లబోదిబోమంటున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతిసారీ రైతులు యూరియా కోసం రోడ్డెక్కి మండుటెండల్లో క్యూలో నిలబడి అవస్థలు పడితే తప్ప దొరకని పరిస్థితి. తాజాగా కూటమి ప్రభుత్వంలో అవే కష్టాలు మొదలయ్యాయి. దీనికి బుధవారం మండలంలోని రామలింగాపురం పీఏసీఎస్ గొడౌన్ వద్ద యూరియా కోసం రైతులు కష్టాలు చూస్తే ఉదాహరణగా నిలుస్తోంది. రామలింగాపురం పీఏసీఏఎస్ పరిధిలో రామలింగాపురం, పుర్రేయవలస, రావివలస, గురానపేట, చీపురుపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు, మహిళలు పెద్ద ఎత్తున గొడౌన్ వద్దకు చేరుకుని యూరియా కోసం ఎగబడి తోసుకున్నారు. దీంతో పీఏసీఎస్ సిబ్బంది సమాచారం మేరకు చీపురుపల్లి నుంచి పోలీసులు వచ్చి దగ్గరుండి స్లిప్పులు పంపిణీ చేశారు. 2019 నుంచి 2024 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో యూరియా కోసం ఒక్క రైతు రోడ్డుక్కిన పరిస్థితి కనిపించలేదు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ముందుగానే ఎరువులు సిద్ధం చేసి రైతులకు అవసరమైన మేరకు సీజన్ ముందే ఎరువులు పంపిణీ చేయించారు. దీంతో ఐదు సంవత్సరాలు రైతులు చక్కగా సాగు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం పుణ్యమాని మళ్లీ వారికి యూరియా కష్టాలు మొదలయ్యాయి.

నిర్వాసితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ బాల సుబ్రహ్మణ్యం

శంగవరపుకోట: జిందాల్ కంపెనీ ఏర్పాటైతే ఉద్యోగాలు వస్తాయి.. ఉపాధి దొరుకుతుందనే నమ్మకంతో భూమిలిచ్చి మోసపోయిన నిర్వాసితులకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ, పీడీఎఫ్ నాయకుడు విఠల్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బొడ్డవరలో ఎమ్మెల్సీ రఘురాజును బుధవారం కలిసి నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ..జిందాల్‌ను నమ్మి నష్టపోయామని రైతులు రోడ్డున పడి ఏడుస్తుంటే.. స్పందించాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పోరాటానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 18 ఏళ్ల గడుస్తున్నా కంపెనీలు పెట్టక పోగా, భూముల్ని దోచుకుని వ్యాపారాలు చేయడం దారుణమన్నారు. రాష్ట్రమంతటా ఇదే తరహాలో రైతుల భూములు దోచేస్తున్నారని ఆరోపించారు. నెల్లూరు, కర్నూలు ప్రాంతాల్లో సోలార్ పేరుతో భూములు లాక్కోవాలని ప్రయత్నిస్తే, రైతులంతా ఒక్కటై పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చిందని చెప్పారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. నిర్వాసితులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి అనుమతులివ్వకపోవడం సరి కాదన్నారు. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న రైతులపై ఎస్.కోట పోలీసులు కేసులు పెట్టి సరికొత్త చరిత్రకు నాంది పలికారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు, పలు గ్రామాల రైతులు, నిర్వాసితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, చిత్రంలో రఘురాజు, తదితరులు

ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలి

వేపాడ: ఖరీఫ్‌లో వరి సాగుచేసే రైతాంగం ఎకరా విస్తీర్ణానికి రెండు వందల రూపాయల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి వేపాడ స్వాతి తెలిపారు. మండలంలోని కుమ్మపల్లి, కృష్ణారాయుడుపేట గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెద సాగు, నారుమడుల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటలకు బీమా చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరిత్యాలు జరిగితే ఎకరాకు 40 వేల రూపాయల వరకు బీమా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వన్ బీ, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, పంటను ధ్రువీకరించే సర్టిఫికెట్‌తో రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కేఆర్‌పేట సర్పంచ్ బాలబాబు, సుస్థిర వ్యవసాయం కేంద్రం రీజనల్ కో ఆర్డినేటర్ వెంకటరావు, మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



కృష్ణారాయుడుపేటలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ స్వాతి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, స్థానిక నేతలు

గుర్ల: మండలంలోని గుజ్జంగివలసలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులకు ఎంపీపీ నిధులు రూ. 6 లక్షలు కేటాయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు బెల్లాన బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ వింగ్ రాష్ట్ర కార్యదర్శి కెంగువ మధుసూదనరావు, సర్పంచ్ రెడ్డి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు అట్టాడ సంధ్యారాణి, స్థానిక నేతలు అట్టాడ రామకృష్ణ, రెడ్డి అప్పలనర్సయ్య, రెడ్డి మురళి, అట్టాడ అప్పలరాజు ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

దత్తిరాజేరు: వరినారుకు తెగుళ్లు సోకుండా వ్యవసాయ సిబ్బంది సలహాలు పాటించాలని ఏఓ అనురాధ అన్నారు. మండలంలోని వంగర గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగం బాగా తగ్గించాలని సూచించారు. ఏ చిన్న అనుమానం ఉన్నా స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ లీలాకృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గజపతినగరం 9010204447 | చీపురుపల్లి 9951602843 | ఎస్.కోట 9951602965
Office mail : vzmadvt@gmail.com